క్లుప్తంగా

తూర్పుకాపు సంఘం ఉపాధ్యక్షుడిగా వెంకటరామకృష్ణ



హిరమండలం: తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మీసాల వెంకటరామకృష్ణ నియమితులయ్యారు. అమరావతి వేదికగా రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా మరోసారి పిషిణి చంద్రమోహన్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా హిరమండలానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, పార్టీ మండల అధ్యక్షుడిగా ఉన్న వెంకటరామకృష్ణ ఎంపిక కావడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తనను ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసిన అధ్యక్షుడు పిసిణి చంద్రమోహన్‌తోపాటు ఇతర ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా తూర్పుకాపుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బాలి దీక్ష ప్రారంభం



శ్రీముఖలింగంలో బాలి దీక్షాపరులు

జలుమూరు: కార్తిక పౌర్ణమి నుంచి కార్తిక మాసం ఆఖరి వరకు జరిగే బాలి యాత్ర ఉత్సవం, దీపోత్సవం పురస్కరించుకుని ఆదివారం నుంచి బాలి దీక్ష చేపట్టినట్లు బాలి యాత్ర నిర్వాహక కమిటీ సభ్యుడు దువ్వాడ జీవితేశ్వరరావు తెలిపారు. 21 రోజులపాటు దీక్ష ఉంటుందన్నారు. శ్రీముఖలింగంలో మధుకేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బాలి యాత్ర నిర్వహణపై సమావేశం నిర్వహించారు. జీవితేశ్వరరావు మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా శ్రీముఖలింగంలో నిర్వహించనున్న బాలి యాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కళింగ రాజ్య పూర్వవైభవాన్ని చాటి చెప్పేందుకు అంతా కలిసి రావాలని కోరారు. నవంబర్ 9వ తేదీన బాలి యాత్ర ఉత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ కె.హరి ప్రసాద్, అర్చకులు శ్రీకృష్ణ, నారాయణ మూర్తి, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

2న కళాకారుల వనభోజనం

ఆమదాలవలస: నవంబర్ 2వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మున్సిపాలిటీలోని నాలుగో వార్డు పరిధిలో గల గేదెలవానిపేట తోటలో కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలను నిర్వహించనున్నారు. కళాకారులు, కళాభిమానులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీనగర్ వీధిలో గల మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కళాకారుల సంఘం అధ్యక్షుడు పేడాడ ధనుంజయరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తేజేశ్వరరావు మాట్లాడుతూ కళాకారులంతా వన భోజనాలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సహాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు, దాస్యం లక్ష్మణరావు, కె.రామారావు ఎస్.చంద్రశేఖరరావు, పి.వి.ఎస్ మాస్టారు, ఎం.ఈశ్వరరావు, బి.గోవిందరావు, కె.రాములునాయుడు, కిరణ్ కుమార్, జి.జోగారావు, సి.హెచ్.ఆదినారాయణ పాల్గొన్నారు.

పాత తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

మెళియాపుట్టి: మండల కేంద్రంలో టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి ఆదివారం పర్యటించారు. స్థానికంగా నిర్వహిస్తున్న బాణసంచా దుకాణాలను పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. బాణసంచా విక్రయాలు చేస్తున్న ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాత తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. దీన్ని కూల్చివేసి అదే స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్ పాపారావుకు సూచించారు. సీనియర్ అసిస్టెంట్ జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పూజలకు.. సర్వం సిద్ధం



నీలకంఠేశ్వర ఆలయ సముదాయం



పాతాళగంగలో దర్శనమిస్తున్న శివలింగం

- ముస్తాబైన ఆలయాలు
- పూజలందుకోనున్న నీలకంఠేశ్వరుడు
- ఒడిశా, ఆంధ్రా నుంచి భక్తుల తాకిడి

పాతపట్నం: పాతపట్నం సమీపంలోని మహేంద్ర తనయ నదీ తీరంలో కొలువుదీరిన నీలకంఠేశ్వర ఆలయం కార్తీక పూజలకు సిద్ధమైంది. పాతాలగంగలో ఉండే ఈ స్వామివారి సన్నిధికి ఒడిశా, ఆంధ్రా నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. కార్తీక మాసం వచ్చిందంటే ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. ఆరు నెలలపాటు నీలకంఠేశ్వరుని శివలింగం రెండు అడుగుల నీటిలోనే ఉంటుంది. ఏటా జూన్ నుంచి డిసెంబర్ వరకు గర్భగుడిలో నీరు ఉంటుంది. ఇది స్వామివారి మహత్యం అని ఆలయ అర్చకులు చెబుతున్నారు. స్వామివారి ఆలయానికి ఒడిశా నుంచి నేరుగా రహదారి సౌకర్యం ఉంది. ఈ ఆలయ ప్రాంగణంలోనే కాశీ విశ్వనాథుడు, రామేశ్వరుడు, మంజునాథుడు, కేథారేశ్వరుడు, సోమేశ్వర స్వామి ఆలయాలున్నాయి. ఈ ఆలయానికి పంచలింగేశ్వర దేవాలయమనే పేరుకూడా ఉంది. ఇక్కడ విఘ్నేశ్వరుడు, పార్వతీదేవి ఆలయాలతోపాటు పంచలోహాలతో ఏర్పాటు చేసిన నందీశ్వరుని విగ్రహం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఆలయం చుట్టూ ఒడిశా సంప్రదాయాల మేళవింపుతో కూడిన శిల్పాలు భక్తులను కనువిందు చేస్తాయి. ఈ నెల 22వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో విద్యుత్ కాంతులతోపాటు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈ దేవాలయం దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో నడుస్తోంది. పాతపట్నంలో కేథారేశ్వర ఆలయం, మంజునాథ ఆలయం ఉన్నాయి.



నీలకంఠేశ్వర ఆలయ ముఖద్వారం

ఏర్పాట్లు చేస్తున్నాం..



కార్తీక మాసం భక్తులకు ఏటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆలయానికి రెండు రాష్ట్రాల భక్తులు అధిక సంఖ్యలో చేరుకుంటారు. నాలుగు సోమవారాల్లోనూ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ, అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– టి.వాసుదేవరావు, ఆలయ ఈఓ, పాతపట్నం

శ్రీముఖలింగేశ్వరుని సేవలో డీఆర్వో



డీఆర్వో దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకుడు రాజశేఖర్

జలుమూరు: ప్రసిద్ధి శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేపట్టారు. ఆలయ ఆవరణలో ఉన్న వివిధ దేవతా విగ్రహాలకు పూజలు చేశారు. అర్చకులు ఆలయ చరిత్రను వివరించి, స్వామివారి కథ, శిల్ప కళా సంపద కోసం వివరించారు. డీఆర్వో దంపతులను పుణ్యాహావచనాలతో దీవించి, తీర్థ ప్రసాదాలు, స్వామివారి శేష వస్త్రాలను అర్చకులు అందించారు. అర్చకులు నాయుడుగారి రాజశేఖర్, నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన అల్లుబోయిన ఢిల్లీశ్వరరావు(మణి)కి ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ఆమదాలవలస జేఎంఎఫ్‌సీ కోర్టు రిమాండ్ విధించింది. నిందితుడిని అంపోలు జైల్‌కి తరలించినట్లు ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక ఆదివారం తెలియజేశారు.

ఢిల్లీశ్వరరావు గత సంవత్సరంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ ప్రజలకు భంగం కలిగించడమే కాకుండా, అసభ్యకరమైన పదజాలంతో దూషించిన తీరుపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు నుంచి వచ్చిన సమన్లను బేఖాతరు చేసినందున నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ అయింది. దీంతో శనివారం ఆమదాలవలస కోర్టులో నిందితుడిని హాజరుపర్చడం జరిగింది. ఆ వ్యక్తి తప్పును పరిగణలోకి తీసుకొని మేజిస్ట్రేట్ ఏడు రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

ప్రాథమిక విద్యే భవిష్యత్‌కు పునాది



ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి చదువుపై దృష్టి పెడితే మంచి భవిష్యత్ ఉంటుందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేటలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూళ్లలో పదో తరగతి(2024–25)లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ప్రాథమిక స్థాయి నుంచి విద్యపై పట్టు ఉండాలన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అప్సా రాష్ట్ర సంఘం నాయకులు సుబ్రహ్మణ్యరాజు, సుందరరాం, అప్సా జిల్లా అధ్యక్షుడు మెట్ట జన్నానరావు, సంఘం స్థానిక ప్రతినిధులు భాస్కరరావు, బోర రామారావు, శ్రీనివాసరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

దీపావళి శుభాకాంక్షలు



రెడ్డి శాంతి

హిరమండలం: చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించుకునే దీపావళి పండగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

రూ.లక్ష వితరణ

హిరమండలం: సత్యసాయి మందిరం నిర్మాణానికి హిరమండలానికి చెందిన సింహాద్రి సాయిరాం (ఎన్ఆర్ఐ) రూ.లక్ష వితరణగా అందించారు. విదేశాల్లో ఉంటున్న సాయిరాం తనవంతు సాయంగా ఈ మొత్తాన్ని అందజేశారు. అంధవరపు అబ్బాయి, బుచ్చబ్బాయిలకు ఈ మొత్తాన్ని ఆదివారం అందించారు. భవిష్యత్‌లో మందిరం అభివృద్ధికి తనవంతు సాయం అందజేస్తానని సాయిరాం చెప్పారు. ఈ కార్యక్రమంలో బెహరా సురేష్, శనగల సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి తప్పనిసరి

కొత్తూరు: వివాహాలు, ఊరేగింపులతోపాటు ఇతర శుభకార్యాలకు డీజేలు పెట్టాలంటే తప్పనిసరిగా పోలీసుల అనుమతి ఉండాలని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజేల నుంచి వచ్చే అధిక సౌండ్ వలన వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, అస్వస్థకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. పురాతన భవనాలు, శిథిలావస్థకు చేరుకున్న భవనాలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. డీజేలను నిర్వహించే వ్యక్తులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల అభ్యున్నతి



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ కమిటీ సభ్యులు

పోలాకి: రాష్ట్రంలో పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మబగాంలో వనతిమండలం, తలసముద్రం, మబగాం పంచాయతీల్లో పార్టీ గ్రామ కమిటీ సభ్యులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేంలో కృష్ణదాస్ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి చేపట్టిన నవరత్నాలు పథకాలు దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచాయన్నారు. ప్రస్తుతం ఆ పథకాలనే కూటమి ప్రభుత్వం పేర్లు మార్చిందన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, వ్యవసాయం విషయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలు విప్లవాత్మకమైనవి అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేపట్టనుండడంతో దీనిని వ్యతిరేకిస్తూ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలను పరిశీలించారు. మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, సర్పంచ్ పిట్ల సూర్యనారాయణ, పార్టీ నాయకులు ధర్మాన లక్ష్మణదాస్, భావన వైకుంఠరావు, ఎన్ని వెంకటేష్, బెలమాన గడ్డెయ్య, కె.లక్ష్మణరావు, రెంటికోట త్రినాథరావు, చింతాడ ఉమామహేశ్వరరావు, కణితి సత్తిబాబు, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలను తిప్పికొట్టాలి



పొన్నాంపేటలో మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజక వర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆమదావలస మండల పరిధిలోని పొన్నాంపేటలో, గాజులకొల్లివసలో, ఆర్ అండ్ఆర్ కాలనీలో ఆదివారం కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలనే ఉన్నత లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో మెడికల్ కాలేజీలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ గొప్ప ఆశయానికి తూట్లు పొడిచి వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఆయా గ్రామాల్లోని అన్నివార్గల ప్రజలు, విద్యార్థులు, మేధావులతో సంతకాల సేకరణ చేశారు. ఆమదాలవలస జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పార్టీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చల్ల సింహాచలం, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు దామోదరరావు, శ్రీనివాసరావు, మొండేటి కూర్మారావు, దన్నాన అజయ్, కామిరెడ్డి శ్రీనివాసరావు, కామిరెడ్డి రమణ, బొడ్డేపల్లి రాజశేఖర్ పాల్గొన్నారు.

బాణ సంచా దుకాణం పరిశీలన



బాణ సంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ

పాతపట్నం: బాణ సంచా దుకాణంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విక్రయించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు సూచించారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ దుకాణాన్ని ఆదివారం పరిశీంచారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఇక్కడ బాణ సంచా విక్రయాలకు అనుమతి ఇచ్చామన్నారు. సీఐ ఎన్.సన్యాసినాయుడు, ఎస్ఐ కె.మధుసూదనరావు, డీటీ బి.వెంకటరమణ, ఆర్ఐ రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.


దర్జాగా కబ్జా..!

- చెరువు గర్భాలు కనుమరుగు
- పొలాలుగా మార్చుతున్న అక్రమార్కులు
- నిత్యం తలెత్తుతున్న సాగునీటి సమస్యలు

సరుబుజ్జిలి: చెరువు గర్భాలను కొంతమంది ఆక్రమించి పొలాలుగా మార్చేస్తున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ, పొందూరు మండలాల్లో సుమారు 580 సాగునీటి చెరువులున్నాయి. వీటి విస్తీర్ణం దాదాపు 3,500 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 11 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలి. ప్రతీ ఏటా గ్రామాల్లో అక్రమార్కులు చెరువులను చెరపట్టడం వలన వాటి స్వరూపాలు కోల్పోతున్నాయి.

ఆక్రమణకు గురైన చెరువులు ఇవే..

సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేట కర్ర చెరువు, నందికొండ శిమ్మకోనేరు, శరభాపురం చెరువు, పాలవలస, రావివలస పెద్దచెరువు, కొండవలసలో సైలాడ, రొట్టవలసలో ముంగెన్న చెరువు, వీరభద్రాపురం అచ్చెన్న చెరువు, కొత్తకోటలో మినీరిజర్వాయర్‌గా పిలవబడే పెద్ద చెరువు, బుడ్డివలస సొండివాని చెరువు ఆక్రమణ చెరలో ఉన్నాయి. ఆమదాలవలస మండలంలోని పాలచెరువు, పెద్దచెరువు కబ్జాలకు గురయ్యాయి.



ఆక్రమణలో ఉన్న రొట్టవలస ముంగెన్న చెరువు

గుట్టుగా ఆక్రమణ..

ముందుగా చెరువులో మట్టితో చదునుచేసి వాణిజ్య పంటలు కొద్దిరోజులు పాటు పండిస్తున్నారు. అనంతరం చెరువును చదును చేసి గట్లు వేసి పొలాలుగా మార్చుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆక్రమించిన చెరువులను అనధికార విక్రయాలు కూడా చేస్తున్నట్లు సమాచారం.



పొలంగా మారిన బుడ్డివలసలోని సొండివాని చెరువు

ఆక్రమణపై దృష్టి పెట్టాలి



మండల కేంద్రంతోపాటు, ఇతర గ్రామాల్లో చెరువు గర్భాల్లో ఆక్రమణలు జరుగుతున్నాయి. దీనిపై పలు మార్లు అధికారుల దృష్టికి తెచ్చాం. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించాలి.

– సురవరపు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ, సరుబుజ్జిలి

సాగునీరు వచ్చేదెలా..



అధిక శాతం గ్రామాల్లో చెరువులపై ఆధారపడి రైతులు పంటలు పండిస్తున్నారు. పంటలకు జీవనాధారంగా ఉన్న చెరువులను ఆక్రమణలు చేయడం వలన ఆయకట్టు కుదించుకపోయి సాగునీటి కష్టాలు తప్పడంలేదు. ఉపాధి పనులు చేసే ఆక్రమణలు గుర్తించాలి. భవిష్యత్‌లో గ్రామ చిత్రపటాల నుంచి చెరువులు మాయంకాక తప్పదు.

– పున్నపురెడ్డి తవిటినాయుడు, మర్రిపాడు

చర్యలు తీసుకుంటాం

చెరువులు గర్భాలు, పోరంబోకు స్థలాల ఆక్రమణ చట్ట రీత్యానేరం. ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు జారీచేసి తగిన చర్యలు తీసుకుంటాం.

– ఎల్.మధుసూదన, తహసీల్దార్, సరుబుజ్జిలి

ఆమదాలవలస నియోజకవర్గంలోని చెరువులు, ఆక్రమణకు గురైన విస్తీర్ణం (ఎకరాలు) వివరాలు ఇలా..

మండలం	చెరువులు	ఆక్రమణలు
సరుబుజ్జిలి	110	70
ఆమదాలవలస	190	250
బూర్జ	120	100
పొందూరు	160	345